క్లుప్తంగా

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి



విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ సిటీ నమూనా

గోపాలపట్నం: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకురాలు గంటా శారద అన్నారు. ఈ మేరకు మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని నవ్యాంధ్ర పాఠశాలలో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి, ఆలోచనల ఆధారంగా వారి భవిష్యత్‌ను నిర్ణయించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు వివిధ రకాల ప్రాజెక్టులు తయారు చేయించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబాకి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. మధ్యాహ్నం పంచహారతులు ఇచ్చారు. అదేవిధంగా సాయంత్రం సామూహిక సాయి సంకీర్తనలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణరావు, కోశాధికారి సుబ్బారావు ఏర్పాట్లు చేశారు.

హోరాహోరీ పోరులో రవికుమార్ విజయం

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైల్వే మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ సెమీస్‌లో అభిషేక్ యాదవ్(దక్షిణ రైల్వే), రవికుమార్(తూర్పు రైల్వే) మధ్య హోరాహోరీగా పోరు సాగింది. 67 కిలోల వెయిట్ కేటగిరీలో జరిగిన ఈ పోటీలో ఇరువురు పంచ్‌లతో దాడి చేసుకోగా రవికుమార్ చివరికి 4–3తో విజయం సాధించాడు. 48 కిలోల వెయిట్‌లో సీహెచ్ ఉపేంద్ర(తూర్పు తీర) 4–1తో కె.సంజిత్‌సింగ్(తూర్పు)పై గెలుపొందాడు.

డ్వామా పీడీ పూర్ణిమాదేవి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

మహారాణిపేట: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.పూర్ణిమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీడీగా ఉన్న ఈ.సందీప్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. విశాఖ డీఎల్‌డీవోగా పనిచేస్తున్న పూర్ణిమాదేవిని డ్వామా పీడీగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఏయూ బీవోఎస్ చైర్మన్‌గా నానాజీరావు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం బీవోఎస్ చైర్మన్‌గా ఆచార్య జి.నానాజీరావు నియమితుడయ్యారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో గురువారం నానాజీరావుకు ఉత్తర్వుల పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను విభాగ ఆచార్యులు అభినందించారు.

బురదమయం.. చిత్తడి చిత్తడి



గుల్లలపాలెంలో మట్టి వాకింగ్ ట్రాక్‌పై నిలిచిన వర్షపు నీరు

- గుల్లలపాలెం వాకింగ్ ట్రాక్, మైదానంలో నిలిచిపోతున్న వర్షపు నీరు
- జారి పడుతున్న క్రీడాకారులు, వాకర్స్
- చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద వాకింగ్ ట్రాక్ చినుకు పడితే బురదమయంగా మారుతోంది. అక్కడ ఆరోగ్య సాధన కోసం నడుస్తున్న వాకర్స్ జారి పడి గాయాల పాలవుతున్నారు. గుల్లలపాలెం వద్ద గల సుమారు ఎకరా స్థలంలో జీవీఎంసీ అధికారులు వాకింగ్ అండ్ సైక్లింగ్ పార్కును 15 ఏళ్ల కిందట నిర్మించారు. జింక్ నుంచి మల్కాపురం ప్రాంతం వరకు గల పలువురు వాకర్స్ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి వచ్చి వాకింగ్ చేస్తుంటారు. మట్టితో వేసిన ట్రాక్‌తోపాటు పక్కనే బీటీ రోడ్డుతో కూడిన మార్గాన్ని కూడా వాకర్స్‌కు, సైకిలింగ్ చేసే వారికి ఏర్పాటు చేశారు. మధ్యలో క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, షటిల్ ఆడుకునేందుకు మైదానంతోపాటు ఓపెన్ జిమ్ నిర్మించారు. అంతా బాగానే ఉన్నా.. వర్షం పడేటప్పుడు మాత్రం ఇక్కడ సమస్య తలెత్తుతోంది. క్రీడాకారులు ఆడుకునే మైదానం ప్రదేశం మట్టితో కూడి గుంతల మయంగా ఉండటంతో వర్షాలు కురిసేటప్పుడు ఈ ప్రాంతం చిత్తడి చిత్తడిగా మారుతోంది. మైదాన ప్రదేశంలో వర్షం నీరు నిలిచి, అది కాస్తా పక్కనే ఉన్న మట్టి వాకింగ్ ట్రాక్‌పైకి వచ్చి నిలిచిపోతోంది. ఈ నీరు పోయే మార్గం లేకపోవడంతో మట్టి రోడ్డు కాస్తా బురదమయంగా మారి ఇటుగా వచ్చే వాకర్స్ జారిపడేలా తయారైంది. గురువారం కురిసిన భారీ వర్షానికి



క్రీడాకారులు ఆడుకునే మైదానంలో వాన నీరు

తెల్లవారుజాము 6 గంటల సమయంలో వాకింగ్‌కు వచ్చిన ఓ యువకుడు రన్నింగ్ చేస్తూ జారి పడిపోయాడు. 55 ఏళ్ల వయసు గల ఓ మహిళ జారి పడ్డారు. మట్టితో కూడిన వాకింగ్ ట్రాక్‌పై పీవీసీతో కూడిన పైకప్పు అమర్చాలని, దీని వల్ల వర్షం నీరు దానిపై పడదని వాకర్స్ సూచిస్తున్నారు. మైదాన ప్రదేశంలో వర్షం నిలవకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు, పలువురు వాకర్స్ కోరుతున్నారు.

నిల్వ నీరు లేకుండా చూడాలి



గుల్లలపాలెం వాకింగ్ ట్రాక్‌పై, మైదానంలో వర్షం నీరు నిలువకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. వర్షా కాలంలో వాకర్స్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ట్రాక్‌పై పీవీసీతో కూడిన పైకప్పు అమర్చితే బాగుంటుంది.

– ఆకుల కనకరాజు, వాకర్, ఇందిరా కాలనీ

జారి పడుతున్నాం



వాకింగ్ కోసం ఈ పార్కుకు వెళ్తే జారి పడే పరిస్థితి నెలకొంది. మట్టి ట్రాక్‌పై వర్షం నీరు నిలిచి బురదమయంగా మారడంతో ఈ సమస్య తలెత్తుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వాకర్స్ జారిపడకుండా తగు చర్యలు చేపట్టాలి.

– కాకర ప్రకాష్‌రావు, మల్కాపురం

ప్రమాదకరంగా యూజీడీ మ్యాన్‌హోళ్లు

అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల మండిపాటు



మూత పగిలిన మ్యాన్‌హోల్‌పై స్థానికులు కప్పిన వ్యర్థాల మూటలు



జయప్రకాష్‌నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్ కాలర్స్

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాష్ నగర్‌లో యూజీడీ మ్యాన్‌హోళ్లు అధికారులతో నిర్లక్ష్యంతో ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ వాటర్ వర్క్స్ విభాగం అధికారులు మ్యాన్‌హోళ్లకు కాలర్స్ వేశారు. వాటిని పూర్తి స్థాయిలో సిమెంట్‌తో పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఈ దారిలో వెళ్లే పాదచారులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వీటి వల్ల గాయాల పాలవుతున్నారు. ఇక్కడ ఒక చోట మ్యాన్‌హోల్ విరిగి పోవడంతో గొయ్యి ఏర్పడింది. దీంతో స్థానికులు అప్రమత్తం చేసేందుకు వ్యర్థాలతో కూడిన గోనె సంచులు దానిపై పెట్టారు. ఈ పరిస్థితి నాలుగు నెలలుగా ఉందని వాపోతున్నారు. కనీసం ఇటువైపు అధికారులెవరూ చూడటం లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి యూజీడీ మ్యాన్‌హోల్ కాలర్స్ వద్ద సిమెంట్‌తో పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత వాసులను కాలుష్యం సమస్య పీడిస్తోంది. ఇక్కడి హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ), కోరమాండల్ పరిశ్రమల నుంచి నిత్యం తెల్లటి పొగ రూపంలో ఆకాశాన్ని తాకేలా కాలుష్యాన్ని వెదజల్లుతుంటే పారిశ్రామిక వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం తెల్లవారు నుంచి మబ్బు వేయడంతోపాటు వర్షం కురవడంతో కోరమాండల్ పరిశ్రమ నుంచి తెల్లటి వర్ణంతో కూడిన పొగ విడుదలైంది. అది ఎటూ పోకుండా ఆ పరిశ్రమను ఆనుకుని ఉన్న గ్రామాలను చుట్టేయడంతో పిలకవానిపాలెం, శ్రీరామ్‌నగర్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల వాసులు ముక్కు మూసుకుని, ఇంటి తలుపులు వేసుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం తాము ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్నామని ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి కాలుష్యం సమస్యకు చెక్ పెట్టేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

62వ వార్డుకు మహర్దశ

కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కృషితో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం



బల్ల లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డుకు త్వరలోనే మహర్దశ పట్టనుంది. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కృషితో ఎన్నో ఏళ్ల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించింది. పోర్ట్ క్వార్టర్స్ నుంచి త్రినాథపురానికి వెళ్లే రహదారిలో ప్రయాణమంటేనే ప్రజలు నరకయాతన పడేవారు. ఈ విషయాన్ని కార్పొరేటర్ లక్ష్మణరావు స్వయంగా గుర్తించి రహదారి విస్తరణకు నిర్ణయించారు. సెంటర్ డివైడర్‌తో రెండు వైపులా ఆధునిక స్ట్రీట్ లైటింగ్‌తో రహదారి నిర్మించాలనే సంకల్పంతో కొంతకాలంగా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం కొనసాగిన కౌన్సిల్ సమావేశంలో ఈ రహదారి నిర్మాణానికి రూ.1.98 కోట్ల నిధులు మంజూరు చేస్తూ కౌన్సిల్ తీర్మానించి టెండర్‌కు పంపించారు. దీంతో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సంతోషం వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక రహదారి సమస్యను పరిష్కరించినందుకు గాను 62వ వార్డు ప్రజల తరఫున మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కౌన్సిల్ దృష్టికి పారిశ్రామిక ప్రాంత తాగునీటి సమస్య



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ తన గళం వినిపించారు. మూడో రోజు సమావేశంలో భాగంగా పీవీ సురేష్ మాట్లాడుతూ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో వినియోగించే పెర్రిక్ ఆలమ్ నిమిత్తం అధిక ధరను వెచ్చించడంతో పాటుగా అవసరానికి మించి వాటిని కొనుగోలు చేస్తున్నారని, దానిపై అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతంలో ఏసీపీ పైప్‌లైను ద్వారానే తాగునీటి సరఫరా జరుగుతున్న కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. అందువల్ల ఆ పైప్‌లైన్లను మార్చాలని, విద్యుత్ కోతలకు సంబంధం లేకుండా నిరంతరం పంపింగ్ జరిగేలా పంపింగ్ స్టేషన్‌లో జనరేటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే కౌన్సిల్ సమావేశం లోపు ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కార్పొరేటర్ సురేష్ కోరారు.

విశాఖ ఉక్కును నష్టాల ఊబిలోకి నెడుతున్న కేంద్రం

అగనంపూడి : కేంద్ర ప్రభుత్వం లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును నష్టాల ఊబిలోకి తోసి ఉద్దేశపూర్వకంగా తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1323వ రోజు రిలే దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును దెబ్బతీయం, తద్వారా వారికి అనుకూలంగా ఉన్న బడాబాబులకు అప్పగించడం కోసం కేంద్ర పెద్దలు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ ఆటలో ఉక్కు ఉన్నతాధికారులు పావులుగా మారారన్నారు. అష్ట దిగ్బంధనం చేసి విశాఖ ఉక్కును నష్టాల ఊబిలోకి నెట్టేసి కోలుకోలేని దెబ్బ తీయడం కోసం కేంద్ర పెద్దలు కుట్రలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఈ అన్యాయాన్ని అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కలుగజేసుకుని రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరక్కుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఎంఎస్, డీబీటీయూ, వీఎస్‌యూ, యూజే, వీఎస్‌పీ ఈయూ, వీఎస్ఎంఎస్ కార్మిక సంఘాల నాయకులు డేవిడ్, సుధీర్‌రాజు, జె.రామకృష్ణ, విళ్లా రామ్మోహన్‌కుమార్, గుమ్మడి నరేంద్ర, దాసరి శ్రీనివాసరావు, ఆర్కే నాయుడు పాల్గొన్నారు.

ఈస్టర్న్ నేవీని సందర్శించిన నార్త్ ఈస్టర్న్ పోలీస్ ట్రైనీలు



తూర్పు నావికాదళ నౌకలను సందర్శిస్తున్న నార్త్ ఈస్టర్న్ పోలీస్ ట్రైనీలు

సింధియా: మేఘాలయలోని ఉమ్సా నార్త్ ఈస్టర్న్ పోలీస్ అకాడమీ నుంచి సుమారు 15 మంది పోలీస్ ట్రైనీలు విశాఖపట్నంలోని తూర్పు నావికాదళ కమాండ్‌ను గురువారం సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ నేవల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ సమన్వయంలో జరిగిన ఈ పర్యటనలో పోలీస్ ట్రైనీలకు నావికాదళ కార్యకలాపాలు, శత్రు బెదిరింపులు, ఇతర సవాళ్లకు సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. అనంతరం అటాచ్‌మెంట్ సమయంలో ట్రైనీలకు ఇంటరాక్టివ్ ప్రెజెంటేషన్, భారత నావికాదళం పాత్రలు, బాధ్యతలను తెలిపారు. తూర్పు నావికాదళ కమాండ్ కార్యాచరణ, పరిపాలన, శిక్షణ కట్టుబాట్లపై వివరించారు. అనంతరం వివిధ నౌకలు, జలాంతర్గాములను సందర్శించారు.

నగరాల్లో జీవన ప్రమాణాలపై చర్చ

జాతీయ సదస్సులో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



సదస్సులో వేదికపై ప్రతినిధులతో జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: ఢిల్లీలో గురువారం నిర్వహించిన ప్రజా జాతీయ అర్బన్ కన్వెన్షన్ – 2024 సదస్సులో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, వాటిని మరింత స్థిరంగా మార్చడం వంటి అంశాలపై జాతీయ స్థాయి సదస్సులో చర్చించడం ఎంతో మంచి పరిణామమన్నారు. ఇందుకు ప్రజా జాతీయ అర్బన్ కన్వెన్షన్ సమావేశం అద్భుతమైన వేదికన్నారు. దేశంలోని అన్ని నగరాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సదస్సులో చర్చించామన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఆర్థిక వ్యవస్థ జీవన ప్రమాణాలకు అనుగుణంగా నిలుస్తుందన్నారు. సదస్సులో జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, షిల్లాంగ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ నుంచి ప్రజాప్రతినిధులు హాజరైనట్లు శ్రీధర్ తెలిపారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో 'స్వచ్ఛతా హీ సేవా'



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఉద్యోగులు

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం గురువారం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ఆదేశాల మేరకు వర్క్స్ కమిటీ చైర్మన్, శాస్త్రవేత్త డాక్టర్ దాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎన్ఎస్‌టీఎల్ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం వారికి పర్సనల్ ప్రొటెక్షన్ కిట్లు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వీ సత్య శ్రీనివాస్, మహిలేష్, కుమార్ సాహు, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ పాల్గొన్నారు.

2 నుంచి జూలో వన్యప్రాణి వారోత్సవాలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, జూ అవుట్‌రీచ్, రీల్ మేకింగ్, బటర్‌ఫ్లై రన్నింగ్ వర్క్‌షాప్, సీడ్ బాల్ మేకింగ్, బర్డ్ వాక్, ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94408 10213ను సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎల్ఎం బృందానికి సహకరించండి

జేసీ మయూర్ అశోక్



పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాకు విచ్చేసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ(ఎన్ఎల్ఎం) బృందానికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్ఎల్ఎం బృందం సభ్యుల క్షేత్ర స్థాయి పర్యటనపై గురువారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, డ్వామా, ఎంపీడీవోలతో జేసీ సమీక్షించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీ స్థాయిలో అమలయ్యే కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుపై బృందానికి వివరించాలని చెప్పారు. బృంద సభ్యులు అనిల్ నింభోర్కర్, అనిల్ గైక్వాడ్ రోజుకు రెండు పంచాయతీల్లో ఐదు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారని తెలిపారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.శోభారాణి, జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, డీపీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కె. శ్రీనివాసరావు, ఎల్డీఎం ఎం.శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హెరిటేజ్ వాక్



హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న పర్యాటక శాఖ డైరెక్టర్లు, అధికారులు

అల్లిపురం: ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా జిల్లాలో చారిత్రక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను తెలిపే విధంగా హెరిటేజ్ వాక్ పేరుతో గురువారం చేపట్టిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. జిల్లా టూరిజం కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ టౌన్‌హాల్ వద్ద ప్రారంభమై.. పలు ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా టూరిజం అధికారులు బ్యానర్లు ప్రదర్శించి.. చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యాన్ని గుర్తించి, గౌరవించాలని నినదించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస ఫణి, జిల్లా పర్యాటక అధికారి జ్ఞానవాణి, ఏపీటీడీసీ ఈఈ రమణ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ పలు విభాగాల్లో ఒప్పందంపై పనిచేస్తున్న కార్మికులను తక్షణం పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. 58, 59, 60 వార్డుల పరిధి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ఆయన గురువారం 60వ వార్డు గుల్లలపాలెంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యపై చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కోవిడ్, హుద్‌హుద్ వంటి విపత్తుల సమయంలో తమ కుటుంబ సభ్యులను విడిచి జీవీఎంసీ కాంట్రాక్ట్ కార్మికులు ఎంతో శ్రమించి పరసరాల పరిశుభ్రతకు తమ వంతు సాయం అందించారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు పనికి తగ్గ వేతనం, పనిలో భద్రత, పర్మినెంట్ చేయడం వంటివి లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను మోసం చేస్తున్న ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని, కార్మికులను పర్మినెంట్ చేసే వరకు తమ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, రైలు బాబు, ఎస్.లక్ష్మి, దుర్గ, శ్యామల, సీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

అల్లిపురం: విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలని విశాఖ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పిలుపునిచ్చారు. గురువారం కళాశాల సమావేశ మందిరంలో ఇగ్నో రీజినల్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో 'శానిటేషన్ అండ్ పర్సనల్ హైజీన్'అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె ప్రసంగించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. కేజీహెచ్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఆచార్యులు సీహెచ్ శిరీష పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇగ్నో రీజినల్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారావు, కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, వెంకటరమణ, వెంకటపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం



లోకేష్‌కు చెక్ అందజేస్తున్న మస్తానరావు కుటుంబ సభ్యులు

కొమ్మాది: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నగరానికి చెందిన హిందూస్తాన్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పి.ఎస్.మస్తానరావు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. బీచ్‌రోడ్డులోని ఓ రిసార్ట్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఈ మొత్తం చెక్‌ను అందించారు. ఆయన కుటుంబ సభ్యులు కుంకుమ రేఖ, భరత్, శ్రీలేఖ పాల్గొన్నారు.

